నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, మంగళవారం 15 ఏప్రిల్ 2025 | HYDERABAD

మూగజీవులకు ఆపదొస్తే సమాచారం ఇవ్వండి

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : పక్షులు, జంతువులు గాయపడితే తమకు సమాచారం అందించాలని గ్రేటర్ హైదరాబాద్ సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రుయాల్టీ టూ ఎనిమాల్స్(జీహెచ్ఎస్‌పీసీఏ) పిలుపునిచ్చింది. 'మీరు వెళ్లేదారిలో మూగజీవాలు ఆపదలో ఉన్నట్లు కనిపించాయా? వెంటనే మా సంస్థకు ఫోన్ చేయండి మా ప్రతినిధులు వచ్చి రక్షిస్తారు.' అంటూ అభయమిస్తున్నారు. వాటికి చికిత్స అందించి అవి గూడు చేరేలా చర్యలు తీసుకుంటామన్నారు. మాంసం అమ్మకాల కోసం ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి జంతువులను అక్రమంగా తరలిస్తుంటారని.. అటవీ అధికారుల సాయంతో అనేక మూగజీవాలను కాపాడామని సంస్థ ప్రతినిధి సౌధర్మ్ తెలిపారు.

8886743881, 8555955202, 9394578568

ద్రోణి ప్రభావంతో..

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని చోట్ల తేలికపాటి నుంచి భారి వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. సోమవారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో గ్రేటర్‌లోని హయత్‌నగర్, రాజేంద్రనగర్, బహదూర్‌పుర, మారేడ్‌పల్లి, మల్కాజిగిరి తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. రాత్రి 9గంటల వరకు హయత్‌నగర్‌లో 8మి.మీలు, బహదూర్‌పురా, రాజేంద్రనగర్‌లో 7 మి.మీలు, మెట్టుగూడలో 6మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు.

హౌసింగ్ బోర్డు స్థలం నాదే..

దరఖాస్తు చేసుకున్న బిల్డర్

అప్రోచ్ రోడ్డు లేకుండానే భారీ భవంతికి అనుమతి

క్షేత్రస్థాయి పరిశీలించకుండానే పర్మిషన్ ఇచ్చేసిన అధికారులు

బీఆర్ఎస్ నేతల ఫిర్యాదుతో వెలుగులోకి అక్రమ కట్టడం

సిటీబ్యూరో/కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : నిర్మాణ రంగ అనుమతుల్లో బడా బిల్డర్లకు నిబంధనలకు తిలోదాకాలిస్తూ అందినకాడికి దండుకుంటూ కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు బహుళ అంతస్తుల భవనాలను జీ హుజూర్ అంటూ పర్మిషన్లు ఇచ్చేస్తున్నారు. ఇంటి నిర్మాణ అనుమతి నుంచి ఓసీ (అక్యూపెన్సీ సర్టిఫికెట్) జారీలో చిన్న పాటి అక్రమం ఉంటేనే సంబంధిత దరఖాస్తును తిరస్కరించే అధికారులు ...ఏకంగా ఎలాంటి అప్రోచ్ రోడ్ లేని స్థలంలో భారీ భవంతికి అనుమతి ఇచ్చిన తీరు అధికారులకే చెల్లింది. కూకట్‌పల్లిలోని కైత్లాపూర్ బ్రిడ్జి సమీపంలో సర్వే నంబరు 988, 991లలోని దాదాపు 2.5 ఎకరాల్లో బహుళ అంతస్తుల (నాలుగు బ్లాక్‌లలో) నిర్మాణానికి బిల్డర్ జీహెచ్ఎంసీకి దరఖాస్తు చేసుకున్నాడు. గతేడాది ఆగస్టులో అధికారులు అనుమతి (ఫైల్ నంబరు 003142) ఇచ్చేశారు. అయితే నిర్మాణ సమయంలో సదరు బిల్డర్ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన 40 అడుగుల స్థలాన్ని అప్రోచ్ రోడ్డుగా చూపించి అడ్డదారిలో అనుమతులు పొందినట్లు ఫిర్యాదులు రావడంతో ఒక్కసారిగా ఈ అంశం టౌన్ ప్లానింగ్‌లో చర్చనీయాంశంగా మారింది.

బీఆర్ఎస్ నేతల ఫిర్యాదుతో వెలుగులోకి..

ఏదైన బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టాలంటే ఆ స్థలానికి అప్రోచ్ రోడ్డు తప్పనిసరి.. సంబంధిత నిర్మాణదారుడిదే ఆ స్థలం అయి ఉండాలి.. కానీ హౌసింగ్ బోర్డు స్థలాన్ని తమది అని చూపిస్తూ బిల్డర్ దరఖాస్తు చేసుకోవడం.. క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించకుండానే చకచకా అధికారులు సదరు దరఖాస్తును క్లియర్ చేశారు. ఈ అనుమతుల జారీలో జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం, కూకట్‌పల్లి జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారుల ఉదాసీనత.. హౌసింగ్ బోర్డు ట్రెస్టన్ డివిజన్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రధాన కార్యాలయ అధికారుల కంటే మేం ఏమైనా తక్కువ అని.. కూకట్‌పల్లి జోనల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కూడా మరో మూడు భవనాలకు జోనల్ స్థాయి అనుమతులను జారీ చేశారు. ఈ విషయంపై కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పగడాల శిరీష బాబూరావును జీహెచ్ఎంసీ, హౌసింగ్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయా విభాగాల అధికారులు.. హౌసింగ్ బోర్డ్ స్థలాన్ని, అనుమతులు ఇచ్చిన భవన స్థలాలను పరిశీలించి, ఈ స్థలంలో చుట్టూ కంచెను వేసే పనులను చేపట్టారు. ఇంతలోనే అప్రమత్తమైన సదరు నిర్మాణదారుడు కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకోవడంతో పనులను నిలిపివేశారు.

40 అడుగుల అప్రోచ్ రోడ్డు..

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్‌లోని కాముని చెరువు సమీపంలోని కైత్లాపూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన.. కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేస్‌కు చెందిన 2.12 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం మీదుగా గతంలో సెప్టిక్ నిర్మాణం కోసం కచ్చా దారి ఉండేది. స్థలాలకు పక్కనే.. కూకట్‌పల్లి గ్రామం సర్వేనంబర్ 988, 991ల్లో ప్రైవేట్ వ్యక్తుల స్థలాలు ఉన్నాయి. ఈ స్థలంలో ఓ ప్రైవేట్ సంస్థ.. ఐదు బ్లాకులు.. ఐదు అంతస్తుల భవన నిర్మాణాల కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సమయంలో హౌసింగ్ బోర్డుకు చెందిన 40 అడుగుల స్థలాన్ని అప్రోచ్ రోడ్డుగా చూపించగా.. ఇవేం పట్టించుకోకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు.. భవన నిర్మాణాల కోసం గతేడాది ఆగస్టు 4న అనుమతులను జారీ చేశారు. మరోవైపు దీని పక్కనే మరో మూడు భవనాల కోసం జోనల్ స్థాయిలో దరఖాస్తు చేసుకోగా మేము ఏమైనా తక్కువ అని.. అప్రోచ్ రోడ్లను పరిశీలించకుండానే అనుమతులను జారీ చేశారు. ఇదిలాఉంటే టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం సర్వే నంబర్ 988, 991లలో రెండు దశాబ్దాల కిందట నుంచే అనుమతులు పొందుతున్నారని చెబుతుండటం గమనార్హం.

కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేస్‌లో రోడ్డుగా చూపించిన హౌసింగ్ బోర్డు స్థలం.. (ఇన్‌సెట్) ఇటీవల పాతిన బోర్డు

ఆలస్యంగా తెలుసుకున్నాం

-కిరణ్ బాబు, ఈఈ, వెస్టన్ డివిజన్, హౌసింగ్ బోర్డు

కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేస్‌లో హౌసింగ్ బోర్డు స్థలం మీదుగా రోడ్డును చూపించి.. భవన నిర్మాణాలకు అనుమతులు పొందిన విషయం ఆలస్యంగా తెలిసింది. వెంటనే ఆ స్థలంలో బోర్డును పాతి కంచెను వేసే పనులను చేపట్టాం. కోర్టు నుంచి స్టే ఆర్డర్ రావడంతో పనులు ఆగిపోయాయి. మరోవైపు జీహెచ్ఎంసీ జోనల్, ప్రధాన కార్యాలయంలో ఫిర్యాదులు చేశాం. అనుమతులు పొందిన వ్యక్తులు చూపిన దారి హౌసింగ్ బోర్డు స్థలమని, దీని గుండా ఎలాంటి దారి లేదని సంబంధిత ప్రతాలు అందించాం. ఉన్నతాధికారుల ఆదేశాల పాటిస్తూ చర్యలు తీసుకుంటున్నాం.

అనుమతులను పరిశీలిస్తున్నాం

- గణపతి, జోనల్ సిటీ ప్లానర్, కూకట్‌పల్లి జోన్

కేపీహెచ్‌బీ కాలనీ 15వ ఫేస్‌లో హౌసింగ్ బోర్డు స్థలాన్ని రోడ్డుగా చూపించి అనుమతులు పొందిన భవనాలను పరిశీలించాం. అనుమతుల కోసం సదరు బిల్డర్ సమర్పించిన ధ్రువప్రతాలను మరోసారి పరిశీలిస్తాం. తప్పుడు ప్రతాలతో అనుమతులు పొందితే చట్టపరంగా చర్యలు ఉంటాయి. నివేదికను అందజేసి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

రోడ్ కటింగ్.. నయా రూల్స్!

ఇబ్బడిముబ్బడి తవ్వకాలకు చెక్

ఇక మీదట ఇంజినీర్లే అన్నింటికీ బాధ్యులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో రోడ్ కటింగ్ అనుమతులపై కమిషనర్ ఇలంబర్తి నూతన నియమ నిబంధనలను అమల్లోకి తీసుకువస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. అడ్డగోలుగా రోడ్ కటింగ్ పర్మిషన్లు ఇస్తుండడం, తిరిగి పునరుద్ధరణలో జాప్యం కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండడం, అంతేకాకుండా ముఖ్యంగా అసంపూర్తిగా రోడ్ కటింగ్ ప్రతిపాదనలు సమర్పిస్తుండడం పట్ల కమిషనర్‌కు ఫిర్యాదులు వెలువెత్తాయి. అన్నింటి కంటే జోనల్ కమిషనర్ల అనుమతితో రోడ్ కటింగ్ పర్మిషన్లు ఇక ఉండకుండా నేరుగా సంబంధిత ఇంజినీర్లే బాధ్యులుగా వ్యవహరించనున్నారు. రోడ్ కటింగ్ పర్మిషన్ నుంచి రహదారి పునరుద్ధరణ వరకు ఇంజినీర్లు కీలకం కానున్నారు.

నూతన నియమ నిబంధనలు ఇవే

- పది మీటర్ల వరకు రోడ్ కటింగ్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనుమతులు ఇవ్వాలి.
- 15 మీటర్ల రోడ్డు కటింగ్ కోసం వచ్చిన దరఖాస్తులను సూపరింటెండెంట్ ఇంజినీర్ పరిశీలించి అనుమతులు ఇవ్వడంతో పాటు పనులు పూర్తయిన తర్వాత పునరుద్ధరణకు మళ్లీ జీహెచ్ఎంసీకి పంపించాల్సి ఉంటుంది.
- 15 మీటర్ల కన్నా ఎక్కువ రోడ్డు కటింగ్‌కు అనుమతులు కోరితే ఆ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. తనిఖీల నివేదికతో పాటు సంబంధిత ఫైల్‌ను చీఫ్ ఇంజినీర్‌కు పంపాల్సి ఉంటుంది.
- గతంలో జారీ చేసిన జీవో 82 ప్రకారం రోడ్డు కటింగ్ క్యాలిక్యులేషన్లు, జీవో 53 ప్రకారం విధించాల్సిన రోడ్డు కట్టింగ్ చార్జీలను తప్పకుండా పాటించాల్సి ఉంటుంది.
- రోడ్డు కటింగ్ మెథలాజీస్‌ను అనుసరించి విధించాల్సిన కటింగ్ చార్జీల శాంపిళ్లను సర్క్యులర్‌లో పొందుపర్చాలి.

అంచనాలు, మంజూరీలు తప్పనిసరి

రోడ్ కటింగ్ పనులు పూర్తయిన వెంటనే రోడ్డును పునరుద్ధరించేందుకు ఇంజినీర్లు అంచనాలు తయారు చేసి, దానికి సంబంధించిన మంజూరీని కూడా జతపర్చాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సంబంధిత రోడ్డుకు సంబంధించి ల్యాండ్ కాస్ట్, కటింగ్‌కు సంబంధించిన గణాంకాలను కూడా సమర్పించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం వస్తున్న రోడ్డు కటింగ్ ప్రతిపాదనలకు గూగుల్ మ్యాప్‌ను కూడా పంపించాలి. కటింగ్‌లకు విధించే చార్జీలకు 16.5 శాతం సెంటేజీ చార్జీలను, అలాగే రోడ్డు పునరుద్ధరణ పనులకు 18 శాతం జీఎస్టీని విధిస్తూ సీఈ (చీఫ్ ఇంజినీర్)కి ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుందని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

'సన్నాహక జోష్'

మేడ్చల్, ఏప్రిల్14(నమస్తే తెలంగాణ): మేడ్చల్ జిల్లాలో జరుగుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశాలతో బీఆర్ఎస్ శ్రేణులలో జోష్ నింపుతున్నది. ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు తరలి వెళ్లేలా సన్నాహక సమావేశాల్లో ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. మేడ్చల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు గాను ఇప్పటికే మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు పూర్తవ్వగా, కుత్బుల్లాపూర్, మేడ్చల్ నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. రెండు రోజులలో రెండు నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాకతో బీఆర్ఎస్ శ్రేణుల్లో మరింత జోష్ నిండింది.

కాంగ్రెస్ పని ఖతం: ఎమ్మెల్యే మల్లారెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: కాంగ్రెస్ పాలనతో విసిగెత్తి ఆ పార్టీ నేతలే బీఆర్ఎస్‌లో చేరడం చాలా సంతోషంగా ఉన్నదని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. చీర్యాల్ గ్రామానికి చెందిన 50 మంది యువజన కాంగ్రెస్ నేతలు సోమవారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పని ఖతం అయిపోయిందని, ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక తికమక పడుతున్నదని అన్నారు. ప్రజలంతా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, మండల మాజీ జడ్పీటీసీ బెస్త వెంకటేశ్, మండల పార్టీ అధ్యక్షులు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, పూలగూర్ల శ్రీనివాస్, కోలల విజయ్‌కుమార్‌యాదవ్, కురం రాము, రామిడి రాంరెడ్డి లతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం నగరవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీ నాయకులు, ప్రజా సంఘాల నేతలు, యువకులు, అధికారులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ సూచించిన మార్గంలో నడువాలని..ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు.

పెండ్లి చేసుకుందాం.. ఇండియాకు వస్తున్నా..

మ్యాట్రిమోనీ మోసాలు మళ్లీ షురూ

వివాహం పేరుతో పరిచయం.. ఆపై గిఫ్ట్‌లంటూ.. చీటింగ్

లక్షలు పోగొట్టుకుంటున్న బాధితులు >II లో

మైనర్లతో మహాకష్టం..

అర్హత లేకున్నా.. వాహనాల డ్రైవింగ్

మూడున్నరనెలల్లోనే 781 కేసులు

మైనర్ల ముందే పేరెంట్స్‌కు పోలీసుల కౌన్సిలింగ్

>II లో

జీరో బిల్లులు హుళక్కి..

గృహజ్యోతి పథకం సర్దుబాటు

వేలల్లో బిల్లులు.. లబ్ధిదారుల ఆవేదన

సిటీబ్యూరో, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ):

- కాటేదాన్ వాసికి ఏప్రిల్‌నెల బిల్లు వచ్చింది. గత నెలలో గృహజ్యోతికింద వచ్చిన బిల్లు ఈనెలలో ఆ పథకం వర్తించలేదు. ఈనెల 4న మీటర్ రీడర్ బిల్లు తీశారు. 29 రోజులకు 199 యూనిట్లు వాడినట్లు ఉండగా మరో రెండురోజులకు 213 యూనిట్లు యావరేజ్ గా వేశారు. రూ.1206 బిల్లు వచ్చింది.
- హబ్సిగూడకు చెందిన ఓ వ్యక్తికి గృహజ్యోతి బిల్లు వచ్చింది. 30 రోజులకు 196 యూనిట్లు వాడినట్లు ఉంది. ఇది మార్చి బిల్లు. ఆ నెలలో 31 రోజులకు సర్దుబాటు చేశారు. దీంతో సగటు నెల యూనిట్లు 203 అయ్యాయి.

నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గృహజ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పుడా పథకానికి నెమ్మదిగా వినియోగదారుల వాడకాన్ని చూపిస్తూ పథకం ప్రకారం లబ్ధిదారుల సంఖ్య తగ్గిస్తోంది.

గృహజ్యోతి పోయినట్లేనా..

గ్రేటర్ హైదరాబాద్‌లో గత సంవత్సరం నుంచి గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లులు మొదలయ్యాయి. ప్రస్తుతం 10,03286 మంది జీరో బిల్లు వాడుతున్నారని అధికారులు చెబుతున్నారు. వీరు ప్రతీనెలా 89.39 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నారు. ఇదంతా వేసవికి ముందు ముచ్చట. ఇప్పుడా లెక్క మారింది. విద్యుత్ వినియోగం వేసవి కారణంగా విపరీతంగా పెరిగింది. అయితే ఇదే వినియోగదారులు సుమారు 110 మిలియన్ యూనిట్ల వరకు విద్యుత్ వినియోగిస్తున్నట్లు అధికారులు లెక్క తేల్చారు. లోడ్ పెరిగిపోతున్నదని, భారం ఎక్కువ కావడంతో కరెంట్ కోతలు తప్పడం లేదని భావించిన ఉన్నతాధికారులు జీరో బిల్లులకు చెక్ పెడుతున్నారు. యావరేజ్ బిల్లుతో జీరో బిల్లు రాకుండా చేస్తున్నారు.గృహజ్యోతి పథకంలో లేనివారికి కూడా ముందస్తు బిల్లు కొంత ఇబ్బందే అయినా వారిపై భారం వందల్లో ఉంటోంది. పథకం లబ్ధిపొందుతున్న వారికి జీరో బిల్లు బదులు వేలల్లో బిల్లులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా వచ్చి బిల్లులు తీయడమే కాకుండా తాము బిల్లు కట్టకపోతే కరెంట్ కట్‌చేస్తామంటూ బెదిరిస్తున్నారని లబ్ధిదారులు వాపోయారు.

యావరేజ్ బిల్లుతో పథకం కట్..

ప్రతీనెలా మీటర్ రీడర్ ఇంటింటికీ వచ్చి కరెంట్ బిల్లులు జారీ చేస్తుంటారు. ఈ క్రమంలో కొందరికి 29 రోజులకు, మరికొందరికీ 32 రోజులు ఇలా వెనకా ముందూ బిల్లింగ్ జారీ చేస్తున్నారు. ఆలస్యంగా తీయడం ద్వారా స్లాబ్ మారి బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో కొన్నేళ్ల కిందట కాల్చిన యూనిట్ల ఆధారంగా కాకుండా నెల సగటు యూనిట్ల ఆధారంగాశ్లాబును నిర్ణయించే పద్ధతిని ప్రవేశపెట్టారు. మీటర్ రీడర్లు ఒక్కోసారి ఒకటి, రెండురోజుల ముందే బిల్లులు ఇస్తుంటారు. ఉదాహరణకు మార్చిలో 29న అంటే రెండు రోజుల ముందుగానే నెల బిల్లింగ్ ఇచ్చారు. మిగతా రెండురోజులకు సగటు లెక్కన బిల్లు జారీ చేశారు. ఈ పద్ధతి గృహజ్యోతి లబ్ధిదారులకు అశనిపాతంలా మారింది. నిర్ణీత 200 యూనిట్లు దాటుతుండడంతో బిల్లు మోత మోగుతోంది.

జైల్లో ఇన్‌స్టా రీల్స్!

సోషల్‌మీడియాలో వీడియో వైరల్



సిటీబ్యూరో/సైదాబాద్, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ): చంచల్‌గూడ జైలులో ఓ రిమాండ్ ఖైదీ రీల్స్ చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. పాతబస్తీకి చెందిన అహ్మద్ జబ్రీ ఈనెల 11న దారి దోపిడీ కేసులో అరెస్టయి చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. అతడిని కలిసేందుకు స్నేహితులు ములాఖత్ సమయంలో వచ్చారు. జబ్రీతో కలిసి రీల్స్ చేశారు. జబ్రీ ల్యాండ్ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు, విచిత్ర భంగిమలతో చేతులూపడం, హావాభావాలతో జైలులో ఎంజాయ్ చేస్తున్నట్లు షూటింగ్ చేశారు. ఈ వీడియోను ఈనెల 13న అహ్మద్ జబ్రీ అకౌంట్‌తో ఉన్న ఇన్‌స్టాగ్రామ్‌లో చంచల్‌గూడ జైలు అంటూ అప్‌లోడ్ చేశారు. ఈ రీల్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీంతో పోలీసులు రీల్ షూట్ చేసి అప్‌లోడ్ చేసిన వ్యక్తిని గుర్తించి చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు. జైల్లో పోలీసుల నిఘా లేకపోవడం వల్లే ఈ సంఘటన జరిగిందని, ములాఖత్‌లోనే రీల్స్ చేయడం కూడా గమనించని జైలు సిబ్బందిపై నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జైలులో రీల్స్ తీసిన అంశంపై చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ స్పందించారు. ములాఖత్‌కు వచ్చిన వారు దుస్తుల్లో మొబైల్ దాచుకుని వచ్చారని, తాము చెక్ చేసే సమయంలో అవి కనిపించలేదని చెప్పారు. రీల్స్ చేసిన సమయంలో గార్డ్ డ్యూటీలో ఎవరెవరు ఉన్నారనేది చెక్ చేస్తున్నామని, వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, జైలులో ములాఖత్‌కు వచ్చే వారి విషయంలో ఇకపై జాగ్రత్తలు పాటిస్తామన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.